# మనిషి విలువ

సంధ్యాసమయం, ఇంకా వీధిదీపాలు వెలుగలేదు. చీకటి తెరలు దిగజారలేదు. సూర్యుడస్తమించినా పడమటి దిక్కున సంజ కెంజాయలు మాసిపోలేదు.

పరుగెడుతున్న లారీలతో బస్సులతో సైకిళ్ళతో హైరోడ్డు సందడిగా వుంది. ప్రయాణ సంరంభంతోనూ, రిబ్బన్లు రొట్టెలు పువ్వులు అమ్ముకుంటున్న కుర్రాళ్ళ కేకలతోనూ బస్‌స్టాండు హోరెత్తిపోతోంది.

హైరోడ్డును బస్‌స్టాండును కలిపే సందు దారికి కుడివైపున ఎల్లోరా హోటలు, ఎడమవైపున బంగారయ్య బంకు.

చల్లని పానీయాలకు, చవులూరే ఫలహారాలకు, చక్కని సరఫరాలకు ఎల్లోరా హోటలు ప్రసిద్ధి.

ఇప్పుడు చెప్పుకోబోతున్న కథ యింకొక పది పదిహేను నిమిషాల్లో ప్రారంభం కానున్న దనగా ఎల్లోరా హోటల్లో వెల్లవేసిన తెల్లటిగోడపైన కొలువు తీరిన గోడగడియారం టంగుటంగున ఆరుసార్లు మ్రోగింది.

అనితకు మునుపు ఓ గంటసేపటి నుంచీ ప్రొప్రయిటరు దగ్గర టేబిలుపైన అధివసించిన రేడియోలో నుంచి 'ఇలంగై వానోలి' గొంతు చించుకుంటోంది.

అతిథి సేవా పరతంత్రులైన సర్వర్లు ఆనతులకు శిరసావహించి అడ్డదిడ్డంగా పరుగెడుతున్నారు. ఫలహార సేవనానికి మధ్య మధ్య నవ్వులు, సంభాషణలు దొర్లిపోతున్నాయి. ఈ అలజడికి తోడు బకెట్లో ప్లేట్లు కడుగుతున్న సవ్వడి ఒకటి!

ఎప్పుడు లోపలికి వెళ్ళాడో, ఎంతసేపున్నాడో మనకు తెలియదు. ఓ పెద్దమనిషి రెండు రూపాయలదాకా వ్రాకిన బిల్లును చెల్లించి ఈవలికివచ్చి హోటలు ప్రాంగణంలో నిల్చున్నాడు.

అతిడు వాడుగిర. అందుకు తగ్గట్టు ఒవాట స్థూల కాయిం అతనద. చుంగిలు జీరాడుతున్న పంచపైన అతడు పసుపురంగు సిల్కుజుబ్బా వేసుకున్నాడు. పాము కుబుసం లాంటి అంగవస్త్రాన్ని కుడిభుజం పైనుంచీ బంత్రోతువాలాకు మల్లే ఎడమభుజం క్రిందికి రాదీసి ముడివేశాడు. చేతిలోని గొడుగును, కళ్ళకద్దంగా నిలిచిన నల్లద్దాల కళ్ళజోడును, చేతివ్రేళ్ళలోని రవ్వల వుంగరాలను గూడా పేర్కొంటే అతడి బాహ్యవర్ణన యించుమించుగా పూర్తవుతుంది.

హోటలు ముంగిటనిలిచి అతడు ఓ అణానాణెం వెచ్చించి బీడాకట్టించుకున్నాడు.

అతనికి రేడియో గానం ఇంపుగా వుంది. బీడా కమ్మగావుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా వుంది. కొరత ఒక్కటే ఒక పొగచుట్ట.

అతడు చరచరా బంకుదగ్గరకు వచ్చాడు.

బంకుపైన కూర్చున్న బంగారయ్య "దయచేయండి బాబూ! ఏంకావాలి?" అన్నాడు.

ఈ మర్యాదకేమి లెమ్మన్నట్టు "ఓ పొగచుట్ట యివ్వవోయ్" అన్నాడు పెద్దమనిషి.

బంగారయ్య పొగచుట్టతో బాటు అగ్గిపెట్టెగూడా సమర్పించుకున్నాడు.

టిఫిను, బీడా, పొగచుట్ట - ఈ మూడింటి కలయిక వలన సిద్ధించిన మత్తులో ఆనందపరవశుడౌతున్న పెద్దమనిషి ఎదుటకు, మాసిపోయి మాసికలుపడిన చింపిరిగుడ్డలు తొడుక్కున్న పదిహేనేళ్ళ కుర్రవాడొకడు పరతెంచి వచ్చాడు.

"బాబ్బాబూ! పట్టె తెగిపోయినట్టుంది. అరగంటలో రిపేరుచేసిపెడ్తాను. జోడు తీయించండి దొరా!"

పెద్దమనిషి తన పాదరక్షలవైపు చూచుకున్నాడు. పట్టె తెగిపోయిన మాట నిజమే!

"అరిగిపోయిన లెదర్‌తీసేసి మంచి టయర్ వేస్తాను. ఆరునెల్లు అరగద్రొక్కినా కిముక్కుమనగూడదు. పనిచూచి డబ్బివ్వండి బాబూ..."

"తమరిలా పలకమీద కూచుని వాడికి చెప్పులివ్వండి బాబూ!... ఒరేయ్ రంగడూ! ఏమనుకుంటున్నావో, అయ్యగారి చెప్పులు అప్పుడే షాపులో కొన్నట్టుండాలి" అంటూ బంగారయ్య రంగడికొక బేరం దొరకడంలో తన పాత్రను సమయస్ఫూర్తిగా నిర్వహించాడు.

"అలాగేనయ్యా అలాగే" అంటూ రంగడు చెప్పులు చేతికి తీసుకుని తన తావులోకివెళ్ళి కూర్చున్నాడు.

రెండు బంకుల మధ్య ఒకటి ఒకటిన్నర మూరల ఖాళీ జాగాలో రంగడు తన మరమ్మత్తు ఖార్ఖానా ఏర్పాటుచేశాడు. కూర్చోడానికి ఓ గోతంపట్ట, నున్నటి రాయి ఒకటి, కత్తిలాంటి సాధనం ఒకటి, రకరకాల తోళ్ళు, టయర్లు, సూదీ, దారమూ, ఈ పరికరాల మధ్య కూర్చుని రంగడు అప్పుడే వెలిగిన వీధి దీపం వెల్తురులో చెప్పుల్ని పరిశీలింపసాగాడు.

రంగడి నివాస మక్కడో ఎవరికి తెలియదు. ఉదయం ఎనిమిద గంటలకు బంగారయ్య బంకు తెరిచేసరికి అతడు తన పరికరాలుంచుకున్న తోలుసంచితో సహా అక్కడ హాజరౌతాడు. వాడు మనుష్యుల ముఖాలు చూడడు. వాళ్ళ దుస్తుల్ని చూడడు. కేవలం పాదాలను మాత్రం చూస్తాడు. కళ్ళు మూసుకుంటే చాలు, వాడి మనోఫలకంపైన వెయ్యి రకాల పాదాలు, సరిగ్గా అన్ని రకాల పాదరక్షలు ప్రత్యక్షమౌతాయి. పొడుగాటి పాదాలు, పొట్టి పాదాలు, మొగపాదాలు; బాటా చెప్పులు, కాన్పూరు షూస్, ఎత్తు మడమల జోళ్ళు...

ప్రపంచాన్ని గురించి రంగడికున్న పరిజ్ఞానంచాలా తక్కువ. కానీవాడి ఉదరపోషణకు ఆ మాత్రం పరిజ్ఞానం చాలు. మొత్తం మానవజాతిని వాడు నాలుగైదు వర్గాలుగా విభజించాడు. మొదటే బేరంచేసి ఆ ప్రకారం డబ్బు ముట్టజెప్పేవాళ్ళు ఒకరకం. రిపేరుచేసిన తరువాత పనిని చూచి ప్రతిఫలం యిచ్చేవాళ్ళు మరొకరకం. జేబులో చేయివేసి చేతికెంత దొరికితే అంత డబ్బునూ గోతంపైకి విసిరి గబగబా వెళ్ళిపోయేవాళ్ళు వేరొకరకం. పావలా పనికి ఓ బేడమాత్రం ముట్టజెప్పి తరువాత ఎంత గింజుకున్నా జేబులో చేయివేయని వాళ్ళు యింకొక రకం.

ప్రొద్దుగూకిన తర్వాత చేతికి తగిలిన ఈ బేరాన్ని ఏ రకం క్రింద చేర్చవలసి వస్తుందో మరి! ఆలోచిస్తూ తన పనిలో నిమగ్నుడై పోయాడు రంగడు.

"తమ దేవూరు బాబూ?" బాతాఖానీకి నాందీవాచకం చదివాడు బంగారయ్య.

తన వూరిపేరేమిటో బంగారయ్యకు తెలియకపోవడం క్షంతవ్యంకాని విషయంగా భావించిందేమో, పెద్దమనిషి ముఖం చిట్లించి, అతడి వైపు ఎగాదిగా చూస్తూ "దామర్లపాడు" అన్నాడు.

"దామర్లపాడా! ఈ మధ్య తెప్పతిరణాల జరిగింది అక్కడేగదండీ!"

"అవును మరి! నీకెలా తెలిసింది?"

"తెలియక పోవడమేమిటి బాబూ! ఎక్కడ బడినా ఆమాటే చెప్పుకున్నారు. తెప్పతిరణాలే గాక పశువుల పరసగూడా జరిగిందట! మంత్రిగా రొచ్చి బాగా బలిసిన కోడెలకు బహుమానాలు గూడా యిచ్చారట!"

"నీకు చాలా వివరాలు తెలిసినట్టున్నాయే! సదరు మంత్రి గారు మన లోగిట్లోనే మకాం చేశారు..."

"అలాగా బాబూ!" వినయభారంతో తాబేలులా ముడుచుకు పోతూ అన్నాడు బంగారయ్య.

ఒకటి రెండు నిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి. ఈ వ్యవధిలో బంగారయ్య బుర్రలో ఓ ఆలోచన హఠాత్తుగా పొడసూపింది.

"ఓ సోడా యిమ్మంటారా బాబూ!"

"ఏం సోడాలేవోయ్, ఆ మాటెత్తితో నాకు డోకొస్తుంది!"

"పోనీ, క్రష్ తీసుకోండి."

అయాచిత సత్కారాన్ని అతినిర్లక్ష్యంగా స్వీకరిస్తూ "ఏమిటోయ్, యింకా ఎంతసేపు పడుతుందేమిటీ?" అని రంగణ్ణి ఒకసారి హెచ్చరించాడు పెద్దమనిషి.

"అయిపోతుంది బాబూ అయిపోతుంది" అన్నాడు రంగడు.

బంగారయ్య ఖాళీగ్లాసును తీసుకుంటూ పెద్దమనిషి దగ్గరికి జరిగాడు. "బాబూ! ఒక చిన్న మనవి."

"ఏమిటి?"

"మరేంలేదు. మావాడొకడు విశాఖ జిల్లాలో వుద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం మంచిదే ననుకోండి బాబూ! కానీ మంచికీ చెడ్డకూ ముఖాలు చూచుకోడానికి మాత్రం వీలుండదు. ఈ బ్రతుకు లేం శాశ్వతం చెప్పండి. ఎక్కడివాళ్ళు అక్కడపడివుంటే ఆ తరువాత దేవుడు పెట్టినట్టవుతుంది."

"రాజీనామా పెట్టి రమ్మనలేకపోయావా మరి!"

"అబ్బే, ఉద్యోగం దొరకడమంటే నోటిమాటటండీ? వెయ్యిమంది కాళ్ళు పట్టుకుంటే దొరికింది. ఐనా మీబోటి వారు గట్టిగా అనుకుంటే రేపీపాటికి వాడిక్కడికి బదిలీ అయిపోడూ!"

"కావచ్చుననుకో! కానీ యిది బస్సురూటుగాకపోయె, చక్కెర ఫ్యాక్టరీగాక పోయె! ఈ మాత్రం పనిగూడా నోరు తెరిచి అడగాలి. అదే వచ్చిన చిక్కు."

"బాబ్బాబూ! తమరలా భావించగూడదు. మీ మేలు మరిచిపోను."

"చూద్దాం, ఆలోచిద్దాం" అన్నట్టు పెద్దమనిషి తలపంకించాడు. ఆ లోపల రంగడు కూడా రిపేరు ముగించేశాడు.

"అడుక్కు చెక్కులాంటి టయరు వేశాను. పట్టెలకు చీలలు దిగ్గొట్టాను. తొడిగిచూడండి దొరా" అన్నాడు.

పెద్దమనిషి జోళ్ళు తొడుక్కున్నాడు. ముందూ వెనుకా చూచుకున్నాడు. జేబులో చేయివేశాడు. ఓ అయిదు రూపాయలనోటు పైకివచ్చింది. "నోటుకు చిల్లరుంది గదూ!" అతడు బంగారయ్యకేసి చూస్తూ అడిగాడు.

"అబ్బే, ఎక్కడిది బాబూ! ఇంతకుమునుపే ఎవరికో యిచ్చేశాను. ఒరేయ్ రంగడూ! హోటల్లో అడిగిచూడరా" అన్నాడు బంగారయ్య.

హోటల్లో ఎన్ని రూపాయలకైనా చిల్లర దొరుకుతుంది. కానీ ఒక్క షరతు– కనీసం ఒక్క కాఫీ అయినా తీసుకోవాలి. అడిగి లేదనిపించుకుని రంగడు అక్కడినుంచీ అంగళ్ళవైపు పరుతీశాడు.

గంట ఏడుకావస్తోంది. హోటల్లో జనం పలచబడిపోయారు బస్స్టాండులో సందడి ఉపశమిస్తోంది. రోడ్డులో కూడా రాకపోకల రద్దీ తగ్గుముఖం పట్టినట్టుంది.

చెక్కపైన కూర్చున్న పెద్దమనిషి క్రిందకి దిగి రంగడి రాకకోసం ఎదురు తెన్నులు చూడసాగాడు.

"వా డెక్కడికి పోతాడండీ! వచ్చేస్తుంటాడు. తమ రింకొక చుట్ట ముట్టిస్తారా బాబూ?" అన్నాడు బంగారయ్య.

"వద్దొద్దు. ఎప్పుడోగానీ చుట్టగాల్చే అలవాటులేదు నాకు!"

నాలుగైదు నిమిషాలు నిరీక్షణలో గడిచిపోయిన తరువాత, గడచిపోయిన ప్రతీ నిమిషమూ రంగడి పలాయనాన్ని బలపరిచిన తర్వాత ఆఖరు రంగడురానే వచ్చాడు. కానీ వచ్చినవాడు ఒంటరిగా రాలేదు. ఓ రక్షకభటుణ్ణి వెంటబెట్టుకొచ్చాడు.

"ఈయనదేనండి డబ్బు" అన్నాడు రంగడు.

అప్పటికీ సందేహనివృత్తికాక పెద్దమనిషి కేసి చూచాడు పోలీసు.

"అవునయ్యా! నిజమే, నేనే చిల్లర మార్చుకురమ్మన్నాను" అన్నాడు పెద్దమనిషి.

"మన్నించండి సార్! నోటుచేతబట్టుకుని పరుగెడుతుంటే అనుమానం తగిలి పట్టుకున్నాను" అన్నాడు పోలీసు.

పెద్దమనిషి చిరాకుతో పోలీసువాడి వైపు చురచురచూచి, రంగడిచేతిలో నుంచీ నోటు లాక్కుని "ఉండు, నేను మార్చుకొస్తాను" అని అంగళ్ళవైపుగా వెళ్ళిపోయాడు.

రంగడు తన పరికరాలను తోలుసంచిలోకి సర్దుకో సాగాడు.

పోలీసు కాసేపక్కడే తటపటాయించి తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ఏడు గంటలకల్లా యింటికి వెళ్ళి పోవడం రంగడివాడుక. ఆరోజు రాత్రి అతడు ఎనిమిది గంటలవరకూ అక్కడే బడిగాపులు పడి పెద్దమనిషికోసం వేచి చూచాడు. కానీ ఎంతకూ అతడు ప్రత్యక్షం కాకపోయే సరికి విసుగెత్తి యింటిదారి పట్టాడు.

పెద్దమనిషి తిరిగి రాకపోవడానికి కేవలం అతడి మతిమరుపే కారణమై వుండవచ్చునంటాడు బంగారయ్య. ఆయన ఎన్ని పనుల మీద పట్టణం వచ్చాడో! వెళ్తుండగా

మార్గంలో ఆయన కెవరెదురయ్యారో! ముష్టి నాలుగణాలు చెల్లించవలసి వస్తుందని ఆయన ముఖంచాటుచేసుకుని వుంటాడని రంగడు సూచిస్తే, వాడి నాలుకను వూడ బెరికేయాలన్నంత కోపంవస్తుంది బంగారయ్యకు!

కానీ బంగారయ్యకు రగడిపైన్నే గాక తనపైన గూడా కోపం రావడం కద్దు! లోకంలో తనకంటే బుద్ధిహీనుడు మరొకడుండడు. లేకుంటే తనాయన పేరేమిటో అడిగి తెలుసుకోక పోవడమేమిటి? కుమారుడు తన కళ్ళముందు తిరుగాడే ప్రాప్తం లేనప్పుడు తనకా ఆలోచన స్ఫురించకపోవడంలో విడ్డూరమేముంది? ఊం, అంతా తన గ్రహచారం!

(...ఆనందవాణి)

⊛ ⊛ ⊛